సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 9 । జూన్ । 2023



పట్టుకున్నారు.. వదిలేశారు

అక్రమాలపై ఉక్కుపాదం మోపాల్సిన సెబ్ అధికారులే ఉదయగిరిలో అక్రమార్కులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు.

8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు) -	రూ.61,400
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -	రూ.5,514
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,679
నవర (8 గ్రా) -	రూ.45,432

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.0 /31.0

గురువారం గాలిలో తేమ 38 శాతం ఉంది. శుక్రవారం అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత కొనసాగుతాయి. వడగాడ్పులు వీస్తాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

చెత్త నుంచి ఆదాయం

- డీపీఓ సుస్మితారెడ్డి



మాట్లాడుతున్న డీపీఓ సుస్మితారెడ్డి

నెల్లూరు(పొగతోట): తడి, పొడి చెత్తలను వేరు చేసి సేంద్రియ ఎరువును తయారు చేయడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చని డీపీఓ సుస్మితారెడ్డి ఎస్‌హెచ్‌జీ మహిళలకు సూచించారు. గురువారం నెల్లూరులోని డీఆర్‌డీఏ కార్యాలయంలో ఉన్న సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సమాఖ్య సమావేశానికి డీపీఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తడి, పొడి చెత్తల నుంచి ఆదాయం సృష్టించుకునే అంశాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. మహిళలు బ్యాంక్ లింకేజ్ రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. సమావేశంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సారమ్మ, డీపీఎం కామాక్షి పాల్గొన్నారు.

వైద్యులు అంకితభావంతో పనిచేయాలి

- కలెక్టర్ ఎం.హరినారాయణన్



నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు నమ్మకం, భరోసా కల్పించేలా వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలపై గురువారం కలెక్టర్ తన చాంబర్‌లో ఆ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సమయపాలన పాటించాలని, ఆస్పత్రికి వచ్చే రోగులను గౌరవించి వైద్యసేవలు అందించాలని సూచించారు. అలాగే నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో లిఫ్టులు, ఏసీల పనితీరుపై కలెక్టర్ సమీక్షించారు.

'ఫ్యామిలీ డాక్టర్' పటిష్టంగా అమలు

జిల్లాలో 'ఫ్యామిలీ డాక్టర్' కాన్సెప్ట్‌ను పటిష్టంగా అమలు చేసేలా చర్యలు చేపట్టామని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, పలు శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అమరావతి నుంచి జగనన్న విద్యాకానుక, నాడు–నేడు, ఫ్యామిలీ డాక్టర్, జగనన్నకు చెబుదాం, వైఎస్సార్ కంటి వెలుగు తదితర పథకాల అమలుపై కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ సమావేశాల్లో జేసీ ఎం.కూర్మనాథ్‌తోపాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ స్కూటీ దగ్ధం



స్కూటీ నుంచి వస్తున్న మంటలు

ఇందుకూరుపేట: ప్రమాదవశాత్తు ఎలక్ట్రిక్ స్కూటీలోని బ్యాటరీ పేలి ఆ వాహనం దగ్ధమైన ఘటన ఇందుకూరుపేట మండలం ముదివర్తిపాళెంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సీహెచ్ శివకుమార్ తన ఎలక్ట్రిక్ స్కూటీకి చార్జింగ్ పెట్టాడు. చార్జ్ పూర్తయిన తరువాత బయటకు వెళ్లేందుకు స్కూటీని స్టార్ట్ చేయబోయాడు. ఆ సమయంలో బ్యాటరీ పేలి పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. శివకుమార్ మంటలు ఆర్పేందుకు ప్రయత్నించాడు. పక్కనే ఉన్న పందిరికి సైతం మంటలు అంటుకున్నాయి. ఇరుగుపొరుగు వారి సాయంతో మంటలను ఆర్పివేశాడు.

నౌక నిర్మాణంపై శిక్షణ



కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో కేడెట్‌లకు నౌక నిర్మాణంపై గురువారం శిక్షణ ఇచ్చారు. శిక్షకుడు ఎస్వీ రామన్ నౌక నిర్మాణం ఎలా చేస్తారు.. వాటిలో ఏఏ భాగాలుంటాయి తదితర అంశాలను వివరించారు. అనంతరం కేడెట్‌లకు డ్రిల్ టెస్ట్, సీమన్ షిప్ పోటీలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కమాండర్ వినయ్ రామచంద్రన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు కె.ఖాదర్‌బాషా, జి.నరేంద్రబాబు, సీవీ నాగరాజు, విద్యాసాగర్, మస్తానయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

థాంక్యూ సీఎం సర్

కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై హర్షం

- కేక్ కట్ చేసిన అధ్యాపకులు
- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం
- హాజరైన ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(టౌన్): ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడంపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 115 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు రెగ్యులర్ అయ్యారు. దీంతో వారి ఆనందాలకు అవధులు లేకుండా పోయాయి. ఏళ్ల నాటి కల సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీర్చారంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు గురువారం నగరంలోని కేఏసీ జూనియర్ కళాశాల వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి పాలాభిషేకం చేశారు. 'థాంక్యూ సీఎం సర్' అంటూ కృతజ్ఞతాపూర్వకంగా భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పేదలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

నెరవేరిన కల

దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎక్కువ మంది కాంట్రాక్ట్ అధ్యాపకులుగా విధుల్లో చేరారు. జిల్లాలో ఆయా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 201 మంది అధ్యాపకులు కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్నారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో 115 మంది అధ్యాపకులు రెగ్యులర్ అయ్యారు. తండ్రి హయాంలో కాంట్రాక్ట్ అధ్యాపకులుగా ఉద్యోగం పొందిన తమను ఆయన కుమారుడు రెగ్యులర్ చేయడం చాలా ఆనందంగా ఉందని చెబుతున్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మాట తప్పకుండా తమను రెగ్యులర్ చేయడంపై ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. 'నాడు–నేడు' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ జూనియర్ కళాశాలలను అభివృద్ధి చేస్తుండడం పేద విద్యార్థుల ఉన్నతిపై ముఖ్యమంత్రికి ఉన్న నిబద్ధతకు అద్దం పడుతోందని అధ్యాపకులు తెలిపారు. కార్యక్రమంలో డీవీఈఓ మధుబాబు, ఆర్ఐఓ వరప్రసాదరావు, రెగ్యులర్ అధ్యాపకుల అసోసియేషన్ అధ్యక్షుడు గురవయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాహసోపేతమైన నిర్ణయం: ఎమ్మెల్సీ

రాష్ట్రంలో 10 వేల మదికి పైగా అధ్యాపకులను రెగ్యులర్ చేయడం సాహసోపేతమైన నిర్ణయమని ఎమ్మెల్సీ పి.చంద్రశేఖరరెడ్డి అన్నారు. మిగిలిన వారిని కూడా దశల వారీగా క్రమబద్ధీకరించేందుకు సీఎం చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఏ సీఎం చేయని విధంగా ప్రభుత్వ ఉద్యోగులకు గ్యారెంటీ పెన్షన్ స్కీం తీసుకువచ్చి ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రిటైర్మెంట్ తరువాత వారి జీవితానికి భరోసా దక్కేలా చేశారని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలన్నారు.



కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించిన సందర్భంగా వారితో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు



కేఏసీ కళాశాల వద్ద 'థాంక్యూ సీఎం సర్' అంటూ నినాదాలు చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

ఆనందం పట్టలేకున్నా



నేను 2002 నుంచి వైద్య ఆరోగ్యశాఖలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. ఉద్యోగం రెగ్యులర్ కావడం అనేది కలగా మిగులుతుందనుకున్నా. ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించారు. ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయంతో ఆనందం పట్టలేకున్నాను.

– సాని శివప్రసాద్, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి

సీఎం మేలు మరువలేను



నేను 21 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాను. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడం ద్వారా మా కుటుంబాల్లో వెలుగులు నింపారు. ఆయన మేలును ఎన్నటికీ మరువలేను.

– జి.దిలీప్, ఫార్మాసిస్ట్, మహ్మదాపురం పీహెచ్‌సీ, పొదలకూరు

కల నెరవేరింది



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయంతో కాంట్రాక్ట్ అధ్యాపకుల కల నెరవేరింది. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో మా జీవితాల్లో వెలుగులు నిండాయి.

– సునీల్‌శర్మ, అధ్యాపకుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

సీఎంకు కృతజ్ఞతలు



కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని గతం సీఎంల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయడం ఎంతో ఆనందంగా ఉంది. సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– గౌస్‌బాషా, అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్

రుణపడి ఉంటాం



కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. ముఖ్యమంత్రి మా బాధలను ఆలకించి ఉద్యోగాలను క్రమబద్ధీకరించారు. మా కుటుంబాల్లో వెలుగులు నింపారు.

– ధనలక్ష్మి, అసోసియేషన్ మహిళా కార్యదర్శి

బీమాతో మహిళలకు ధీమా

- ఎస్‌హెచ్‌జీ మహిళలకు ఏడాదికి రూ.436 ప్రీమియం
- ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.4 లక్షల పరిహారం
- బ్యాంకు అకౌంట్ ఉన్న ఇతర మహిళలూ అర్హులే

నెల్లూరు(పొగతోట): స్వయం సహాయక గ్రూపు (ఎస్‌హెచ్‌జీ) మహిళలందరూ ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై)లో నమోదయ్యేలా అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 3.90 లక్షల మంది మహిళలు ఎస్‌హెచ్‌జీల్లో సభ్యులుగా ఉన్నారు. వారిలో సుమారు 2.80 లక్షల మంది పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవైలలో పేర్లు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. మిగిలిన మహిళలు కూడా సభ్యులుగా చేరేలా చూస్తున్నారు. రెండు బీమాల్లో సభ్యులుగా ఉండి ప్రమాదవశాత్తు మరణిస్తే కుటుంబసభ్యులకు రూ.4 లక్షలు నగదు చెల్లిస్తారు. వైఎస్సార్ బీమా ద్వారా పురుషులకు బీమా సౌకర్యం కల్పిస్తున్నారు. మహిళలకు లేదు. పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవైల ద్వారా మహిళలకు బీమా సౌకర్యం ఉంటుంది.

నిబంధనలు ఇలా..

పీఎంజేజేబీవైకి 18 నుంచి 50 సంవత్సరాల్లోపు వయసున్న మహిళలు అర్హులు. బ్యాంకు అకౌంట్ తప్పనిసరిగా ఉండాలి. సంవత్సరానికి రూ.436 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. రూ.2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుంది. పీఎంఎస్‌బీవైకి 18 నుంచి 70 సంవత్సరాల్లోపు వయసున్న మహిళలు అర్హులు. ఏడాదికి రూ.20 ప్రీమియం చెల్లించాలి. రూ.2 లక్షలు బీమా వర్తిస్తుంది. ఈ రెండింటిలో నమోదైన మహిళల్లో 50 సంవత్సరాల్లోపు వయసున్న వారు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.4 లక్షలు బీమా లభిస్తుంది. ఈ నెలాఖరు వరకు రెన్యూవల్స్ చేస్తున్నారు. వచ్చే నెల 1 నుంచి 7వ తేదీ వరకు కొత్త పాలసీలు స్వీకరించి నమోదు చేయనున్నారు. స్వయం సహాయక మహిళలే కాకుండా ఇతర మహిళలు కూడా సభ్యులుగా నమోదు చేసుకునే అవకాశం ఉంది. సభ్యులు మరణిస్తే దహన సంస్కారాల ఖర్చులకు రూ.10 వేలు ముందుగా అందజేస్తారు. గ్రామంలో పెద్దల సమక్షంలో కుటుంబసభ్యులకు నగదు ఇస్తారు.



బీమా నగదు అందజేస్తున్న డీఆర్‌డీఏ సిబ్బంది (ఫైల్)

సద్వినియోగం చేసుకోవాలి

స్వయం సహాయక గ్రూపు మహిళలందరూ ఈ బీమా పథకాల్లో సభ్యులుగా చేర్పేలా చర్యలు తీసుకుంటున్నాం. 3.90 లక్షల మంది మహిళలు గ్రూపుల్లో ఉన్నారు. ప్రస్తుతం 2.80 లక్షల మందిని సభ్యులుగా చేర్పించాం. ప్రీమియం కూడా తక్కువగానే ఉంది. ఎస్‌హెచ్‌జీల్లో సభ్యులే కాకుండా ఇతర మహిళలు కుడా సభ్యులుగా నమోదు చేసుకునే అవకాశం ఉంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సాంబశివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

నర్రవాడలో పర్యాటక అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్

- ఏపీ టూరిజానికి 50 ఎకరాల కేటాయింపు
- స్థల పరిశీలన చేసిన ఆర్డీఓ శీనానాయక్

ఉదయగిరి, దుత్తలూరు: దుత్తలూరు మండలం నర్రవాడలో పర్యాటక అభివృద్ధికి అవసరమైన 50 ఎకరాల స్థలాన్ని ఇచ్చేలా ప్రభుత్వం జీఓ జారీ చేసిన నేపథ్యంలో గురువారం కావలి ఆర్డీఓ శీనానాయక్ నర్రవాడ బీసీ కాలనీ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రాంతంలో 22 ఎకరాలు అందుబాటులో ఉన్నట్లు తహసీల్దార్ సోమ్లానాయక్ ఆర్డీఓకు తెలిపారు. తద్వారా ఈ భూమిని ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థకు ఇచ్చేందుకు మార్గం సుగమమైంది. త్వరలో మిగతా 28 ఎకరాలను కూడా సేకరించి అందజేస్తామని ఆర్డీఓ తెలిపారు. రాష్ట్రంలో ప్రఖ్యాతిగాంచిన శ్రీవెంగమాంబ అమ్మవారి దేవస్థానాన్ని దర్శించుకునేందుకు ప్రతి ఏటా 5 లక్షల మందికి పైగా భక్తులు వస్తున్నారు. ఈ నేపథ్యంలో నర్రవాడను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరుతూ గతంలో చైర్మన్‌గా ఉన్న కరుణాకర్ ప్రభుత్వానికి వినతిపత్రం అందించారు. స్పందించిన ప్రభుత్వం వారం రోజుల క్రితం 50 ఎకరాల స్థలం ఏపీ పర్యాటక సంస్థకు ఇవ్వాలని జీఓ జారీ చేసింది. ఈ క్రమంలో హరిత హోటల్స్, యాత్రికులకు అవసరమైన ఆధునిక భవనాలు, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పచ్చదనంతోపాటు మరికొన్ని వసతులు ప్రభుత్వం కల్పించనుంది. తద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.



నర్రవాడ బీసీకాలనీ సమీపంలో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న అధికారులు

బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలి

దుత్తలూరు: జిల్లాలో ప్రసిద్ధి పొందిన శ్రీవెంగమాంబ అమ్మవారి బ్రహ్మోత్సవాలను అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జయప్రదం చేయాలని కావలి ఆర్డీఓ శీనానాయక్ తెలిపారు. మండలంలోని నర్రవాడలో వెంగమాంబ ఆలయ ఆవరణలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణపై అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని, ఉత్సవాల సందర్భంగా 400 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, భక్తుల సౌకర్యార్థం 50 ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పచ్చవ కరుణాకర్, మునలయ్య, ఈఓ ఉషశ్రీ, డీఎల్‌పీఓ మాధవీలత, తహసీల్దార్ సోమ్లానాయక్, ఎంపీడీఓ సాయిప్రసాద్, సీఐ రాజేష్, ఎస్సై ప్రభాకర్, ఆర్టీసీ డీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారామాలయం ప్రారంభోత్సవం



సీతారాములకు పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: మండలంలోని లక్ష్మీనరసింహాపురం ఎస్టీకాలనీలో టీటీడీ నిధులతో నిర్మించిన సీతారామాలయాన్ని గురువారం రాత్రి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. సీతారాములకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో తమకు రామాలయం కావాలని గిరిజనులు కోరడంతో టీటీడీ ద్వారా రూ.10 లక్షల నిధులు సమకూర్చి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశానని తెలిపారు. టీటీడీ నిధులతోపాటు గ్రామపెద్ద ఉప్పలపాటి రామసుబ్బానాయుడు సొంత నిధులు వెచ్చించి ఆలయ నిర్మాణాన్ని పూర్తిచేశారని తెలిపారు. తద్వారా గిరిజనుల కల నెరవేరిందని తెలిపారు. రామాలయ నిర్మాణానికి సహకరించిన టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, ఈఓ ధర్మారెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, నాయకులు బొమ్మిరెడ్డి హరిగోపాల్‌రెడ్డి, ఉప్పలపాటి రమేష్‌నాయుడు, జగదీష్, గుమ్మడి వెంకటసుబ్బయ్య, ఏడెం మల్లికార్జునరెడ్డి, వల్లూరు హర్షవర్ధన్‌రెడ్డి, మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, చిట్టమూరు అజయ్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, ఆలూరు రాము భాస్కర్‌గౌడ్, ఏడుకొండలు, శశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో 37.750 టీఎంసీలు

చేజర్ల(సోమశిల) : సోమశిల జలాశయంలో గురువారం నాటికి 37.750 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 98 క్యూసెక్కుల వంతున వరద వచ్చి చేరుతోంది. పెన్నార్ డెల్టాకు 3,700, ఉత్తర కాలువకు 230, దక్షిణ కాలువకు 200, కండలేరుకు 100 క్యూసెక్కులు వంతున విడుదల చేస్తున్నారు.

133 మంది హెచ్‌ఎంల బదిలీ

నెల్లూరు(టౌన్): ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా జిల్లాలో 133 మంది గ్రేడ్–2 హెడ్‌మాస్టర్లు బదిలీ అయ్యారు. వారికి బుధవారం రాత్రి జిల్లా విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేయగా గురువారం ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరారు. అలాగే సీనియర్ అసిస్టెంట్‌లు, సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఆప్షన్ గురువారంతో ముగిసింది. వీరికి శుక్రవారం బదిలీ ఆర్డర్లు వచ్చే అవకాశం ఉందని జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. వీరు శుక్రవారం ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరాల్సి ఉంటుందని సమాచారం. జిల్లాలో తప్పనిసరి, రిక్వెస్ట్ కింద 2 వేల మందికి పైగా హెడ్‌మాస్టర్లు, ఉపాధ్యాయులు బదిలీ అయ్యే అవకాశం ఉందని తెలిసింది.

పెద్దాస్పత్రి నిర్వహణకు రూ.95 లక్షల విడుదల

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వివిధ రకాల పరికరాల మరమ్మతులు, నిర్వహణకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ రూ.95 లక్షలు విడుదల చేసింది. ఆస్పత్రి నిర్వహణకు నిధులివ్వాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ డీఎంఈకి లేఖ రాయడంతోపాటు స్వయంగా మాట్లాడారు. దీంతో గురువారం నిధులు విడుదల చేశారు. ఈ నిధులను ఏసీ, లిఫ్టుల మరమ్మతులు, ఇతర నిర్వహణకు వినియోగించుకునేలా కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. తద్వారా ఆస్పత్రిలో పలు సేవలు అందుబాటులోకి వస్తాయి.

క్లుప్తంగా

స్కూటీ కొనుగోలుకు ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

నెల్లూరు సిటీ: ఓ దివ్యాంగుడు ఉద్యోగానికి వెళ్లేందుకు ప్రత్యేక స్కూటీ కొనుగోలు చేసేందుకు హ్యాండ్స్ ఆన్ ఫౌండేషన్ ఫౌండర్ డి.రమేష్ గురువారం ఆర్థిక సాయం చేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని కోటమిట్టలో నివాసం ఉంటున్న బత్తుల దయాసాగర్ మున్సిపాలిటీలో డ్రైవర్‌గా పని చేసేవాడు. 2019లో కరోనా తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తాయి. చికిత్స కోసం సుమారు రూ.13 లక్షలు ఖర్చు చేశారు. దీంతో కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. మున్సిపల్ అధికారులు అతడి పరిస్థితి చూసి పార్కింగ్ వద్ద వాచ్‌మన్ ఉద్యోగం కల్పించారు. దయాసాగర్ ఉద్యోగానికి వెళ్లేందుకు ప్రత్యేక స్కూటీ కొనుగోలుకు రమేష్ రూ.24 వేలను చెక్కు రూపంలో అందజేశారు. మిగిలిన మొత్తాన్ని దయాసాగర్ ఈఎంఐ రూపంలో కట్టుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పల్టీలు కొట్టిన కారు



ఘటనా స్థలంలో కారు

పొదలకూరు: నెల్లూరు – పొదలకూరు మార్గంలో ఓ దాబాకు సమీపంలో బుధవారం రాత్రి కారు పల్టీలు కొట్టి రోడ్డు పక్కన ముళ్లపొదల్లో పడింది. అందులో ప్రయాణిస్తున్న వారు స్వల్పగాయాలతో బయటపడినట్లుగా తెలుస్తోంది. అతివేగమే ప్రమాదానికి కారణంగా చెబుతున్నారు. కారు నెల్లూరు నుంచి అన్నమయ్య జిల్లా చిట్వేలికు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బాత్‌రూమ్‌లో వృద్ధుడి మృత్యువాత

- ఆలస్యంగా వెలుగులోకి..

నెల్లూరు(క్రైమ్): అనారోగ్యమో? మరే ఇతర కారణమో స్పష్టంగా తెలియదు కానీ బాత్‌రూమ్‌లో వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. పొదలకూరురోడ్డు పోలీసు కాలనీ ఐదో వీధిలో ఎం.బుజ్జయ్య (80) అనే వృద్ధుడు తన కుమారుడు నాగమహేంద్రతో కలిసి నివాసం ఉంటున్నారు. ఆయన భార్య 2018లో మృతిచెందారు. కుమారుడు పదోతరగతి వరకు చదువుకుని ప్రైవేట్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఓ వైపు వృద్ధాప్యం మరోవైపు కిడ్నీ, బీపీ, షుగర్ సంబంధిత వ్యాధులతో బుజ్జయ్య బాధపడుతూ చికిత్స చేయించుకుంటున్నారు. నాగమహేంద్ర రెండు వారాల క్రితం గూడూరులోని తన మేనమామ శివ ఇంటికి వెళ్లి పనుల కోసం ప్రయత్నాలు చేయసాగాడు. అప్పటి నుంచి బుజ్జయ్య ఒక్కరే ఉంటున్నారు. ఈనెల రెండో తేదీన పక్కింటివారు బుజ్జయ్యకు వాటర్ క్యాన్ ఇచ్చి వెళ్లారు. అప్పటి నుంచి ఆయన బయటకు రాలేదు. కుమారుడికి సైతం ఫోన్ చేయలేదు. దీంతో నాగమహేంద్ర ఈనెల 7వ తేదీ రాత్రి నెల్లూరుకు వచ్చాడు. బుజ్జయ్య ఇంటి వెనుకనున్న బాత్‌రూమ్‌లో చనిపోయి ఉన్నాడు. మృతదేహం కుళ్లి, పురుగులు పట్టి దుర్వాసన వెదజల్లుతూ ఉంది. దీంతో ఆయన బుధవారం అర్ధరాత్రి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతికి గల కారణాలు తెలియరావాల్సి ఉంది.

కుమ్మక్కు.. జిమ్మిక్కు

- ఆగని రేషన్ బియ్యం అక్రమ రవాణా
- రాంగ్ రూట్‌లో రైస్‌మిల్లులకు..
- కొందరు డీలర్లు, అధికారుల పాత్ర
- తనిఖీలు అంతంతమాత్రమే
- ప్రభుత్వ లక్ష్యాలకు తూట్లు

జిల్లాలో..	
రేషన్ కార్డులు	చౌక దుకాణాలు
7,22,240	1,513

ఇటీవల నెల్లూరు రంగనాయకులపేటలోని 14వ నంబర్ చౌక దుకాణంలో దించాల్సిన రేషన్ బియ్యం బస్తాలను రూరల్ పరిధిలో ఓ రైస్‌మిల్లు వద్ద దించే ప్రయత్నం జరిగింది. సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు అక్కడికి వెళ్లి మినీ లారీని సీజ్ చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాగా విచారణలో నెల్లూరులోని ఓ దుకాణానికి అక్రమంగా 600 కేజీల రేషన్ బియ్యాన్ని తరలించినట్లు గుర్తించారు. 14వ నంబర్ దుకాణంలో 2,400 కేజీల బియ్యం తక్కువగా ఉండడంతో 6ఏ కేసు నమోదు చేశారు.



నెల్లూరు(పొగతోట): రేషన్ బియ్యం పక్కదారి పడుతూనే ఉంది. కొందరు అధికారులు, చౌక దుకాణాల డీలర్లు కుమ్మక్కై ప్రభుత్వ లక్ష్యాలకు తూట్లు పొడుస్తున్నారు. బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు నూతన పద్ధతులు ప్రారంభించినా అక్రమార్కులు కొత్త దారులు వెతుక్కుంటున్నారు. జిల్లాలోని 38 మండలాల్లో 7,22,240 రేషన్ కార్డులు, 1,513 చౌక దుకాణాలు ఉన్నాయి. కార్డుదారులకు ప్రతి నెలా బియ్యం, కందిపప్పు, చక్కెర అందజేస్తున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి చౌక దుకాణాలకు రేషన్ సరఫరా జరుగుతుంది. అక్కడి నుంచి ఎండీయూ ఆపరేటర్ వాహనాల్లో కార్డుదారుల ఇళ్ల వద్దకు రేషన్ పంపిణీ చేస్తున్నారు.

ఏం జరుగుతోందంటే..

కొందరు ఎండీయూ ఆపరేటర్లు, చౌక దుకాణాల డీలర్లు కలిసి లబ్ధిదారుల నుంచి కేజీ రూ.10 చొప్పున బియ్యం కొనుగోలు చేస్తున్నారు. ఇంకా కొందరు ఇతర కారణాలతో బియ్యం తీసుకోరు. దీనిని కూడా డీలర్ రైస్‌మిల్లులకు కేజీ రూ.20 నుంచి రూ.25కు విక్రయిస్తున్నాడు. మిల్లర్ అక్రమంగా సేకరించిన బియ్యాన్ని పాలిష్ పట్టి నాణ్యమైన బియ్యంలో కలిపి బహిరంగ మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. మార్కెట్‌లో 25 కేజీల బియ్యం బస్తా రూ.1,200 నుంచి రూ.1,400 వరకు అమ్ముతున్న పరిస్థితి ఉంది. మరోవైపు చెన్నై, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు లారీల్లో రేషన్ బియ్యం తరలించే మాఫియా ఉంది. ఈ తతంగం ప్రతి నెలా జరుగుతోంది.



ఇటీవల నెల్లూరు రూరల్ పరిధిలో రేషన్ బియ్యం బస్తాలను పట్టుకున్న అధికారులు

కఠిన చర్యలు తీసుకుంటాం



బియ్యం అక్రమ రవాణా చేస్తున్న డీలర్లు, వారికి సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. చౌక దుకాణాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు చేసేలా ఆదేశాలిస్తాం. ప్రజా పంపిణీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెడతాం.
– ఆర్.కూర్మనాథ్, జేసీ

ఇక్కడికి చేరుతోంది

కందుకూరు, ఉదయగిరి, మర్రిపాడు, ఆత్మకూరు, వింజమూరు తదితర ప్రాంతాల నుంచి బియ్యం అక్రమంగా తరలిస్తున్నారు. కందుకూరు ప్రాంతాల నుంచి వచ్చే బియ్యం కావలిలోని రైస్‌మిల్లులకు చేరుస్తున్నారు. ఉదయగిరి, వింజమూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చే బియ్యం సంగం, నెల్లూరు రైస్‌మిల్లులకు చేరుతోంది. ఈ విషయంపై అధికారులకు సమాచారం ఉన్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి బయలుదేరిన వాహనం రూట్ మ్యాప్ ప్రకారం నిర్దేశించిన చౌక దుకాణాల్లో బియ్యం అన్‌లోడ్ చేయాలి. అధికారులు, డీలర్లు కుమ్మక్కు కావడంతో చౌక దుకాణాల్లో సగం బియ్యం అన్‌లోడ్ చేసి మిగిలిన దానిని రైస్‌మిల్లులకు తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

పరిశీలించిన ప్రతిసారి..

సంబంధిత శాఖ, విజిలెన్స్ అధికారులు చౌక దుకాణాలను పరిశీలిస్తున్న ప్రతిసారి బియ్యం నిల్వలు తక్కువగా ఉంటున్నాయి. ఎంఎల్ఎస్ పాయింట్‌లో మాత్రం పూర్తి స్థాయిలో సరఫరా చేసినట్లు నమోదు చేస్తున్నారు. ఇటీవల అల్లూరు చౌక దుకాణంలో 400 కేజీలు తక్కువగా ఉండడంతో 6ఏ కేసు నమోదు చేశారు. ఎఫ్ఏ, సీఎస్‌డీటీలు, తహసీల్దార్లు క్రమం తప్పకుండా పరిశీలించాల్సి ఉన్నా పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి.

కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న

- మాట తప్పని నేత సీఎం వైఎస్ జగన్
- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు (విడవలూరు): సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పదివేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముదివర్తి గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఇందులో ఎమ్మెల్యే పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి పథకాలు అందాయా? లేదా? అని ఆరాతీశారు. బుక్‌లెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇస్తే తప్పరని మరోసారి రుజువైందన్నారు. నాడు వైఎస్సార్.. నేడు జగన్ హయాంల్లోనే ఉద్యోగులకు న్యాయం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ఎంతోమంది హామీలు ఇస్తుంటారని, అయితే ఇచ్చిన వాటిని నెరవేర్చింది వారిద్దరూ మాత్రమే అన్నారు. ఉద్యోగులకు ముఖ్యమంత్రి ఏనాడు కూడా అన్యాయం చేయరన్నారు. ఈ విషయంలో కూడా చంద్రబాబు రాజకీయం చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఒకరు చెడిపోవాలని బాబు కోరుకోవడం తప్ప.. మంచి కోరుకున్న పాపన పోలేదన్నారు. గతంలో చంద్రబాబు హయాంలో ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారని, జగనన్న అన్ని వర్గాలకు అండగా ఉన్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 64 సచివాలయాల పరిధిలో 75,800 గడపలు తిరిగినట్లు తెలిపారు. మా ప్రభుత్వంలో ఇలాంటి సంక్షేమ పథకాలు చూడలేదని టీడీపీ నాయకులు చెబుతున్నారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల గౌరవాధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, మాజీ ఏఎంసీ చైర్మన్లు అచ్యుత్‌రెడ్డి, విజయభానురెడ్డి, జెడ్పీ సభ్యులు లక్ష్మయ్య, శ్రీహరిరెడ్డి, సొసైటీ చైర్మన్లు ప్రసాద్ రెడ్డి, కొండూరు లక్ష్మీనారాయణరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు సౌందర్య, సర్పంచ్ నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాడు – నేడుతో బడులకు కొత్త కళ



బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

దగదర్తి (కావలి): భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్యనందించి పేదరికాన్ని శాశ్వతంగా రూపుమాపేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాడు – నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలకు కొత్త కళ వచ్చిందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. దగదర్తి మండలం తిమ్మారెడ్డిపాళెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గురువారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా సంక్షేమ పథకాలతో నూతన ఒరవడి సృష్టించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదల జీవితాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయన్నారు. ఆర్థిక భద్రత కలిగించేలా పలు పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఆర్బీకేల ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడంతో పాటు రైతులకు ఉచితంగా పంట బీమా వంటి సౌలభ్యాలు కల్పించినట్లు తెలిపారు. పాలనలో నూతన శకానికి శ్రీకారం చుడుతూ ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థకు దేశ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లూరి ప్రసాద్‌నాయుడు, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ అనిల్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభం నేటికి వాయిదా

నెల్లూరు సిటీ: నెల్లూరు – తిరుపతి మధ్య 12 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను శుక్రవారం ఉదయం పది గంటలకు ప్రారంభించనున్నట్లు ఆర్టీసీ డిపో–2 మేనేజర్ శివకేశవ్ యాదవ్ గురువారం ప్రకటనలో తెలిపారు. గురువారం ఈ కార్యక్రమం జరగాల్సి ఉండగా అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు తెలియజేశారు.

గాయపడిన వారిలో మరో వ్యక్తి మృతి

చేజర్ల: మండలంలోని మాముడూరు గ్రామ సమీపంలో ఉన్న సవకతోటలో అక్రమంగా బాణసంచా తయారు చేస్తుండగా జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిలో మరో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటనలో మొత్తం ఐదుగురు గాయపడగా వారంరోజుల క్రితం ఒకరు మృతిచెందిన విషయం తెలిసిందే. నారాయణ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చలంచర్ల రమేష్ (32) అనే వ్యక్తి రెండురోజుల క్రితం చనిపోయాడని ఎస్సై మరిడినాయుడు గురువారం తెలిపారు. మృతుడి స్వగ్రామం కోవూరు దగ్గర విఘ్నేశ్వర కాలనీ.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.40
సన్నవి	రూ.25
పండ్లు	రూ.10

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	162	బ్రాయిలర్ స్కిన్‌లెస్	304
లేయర్ (లైవ్)	100	లేయర్ చికెన్	170
బ్రాయిలర్ చికెన్	274		

గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం

- ఇద్దరికి గాయాలు

ఆత్మకూరు: గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం జరిగిన ఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని పంటవీధికి చెందిన ఇందూరు కౌసల్యమ్మ, ఆమె కుమార్తె బుధవారం సాయంత్రం తమ ఇంట్లో వంట గ్యాస్ అయిపోవడంతో సిలిండర్ మార్చారు. రెగ్యులేటర్ సక్రమంగా బిగించకపోవడంతో గ్యాస్ లీకైంది. ఈ క్రమంలో సహాయం కోసం ముందు ఇంట్లో ఉంటున్న నాగులపాటి విజయలక్ష్మిని పిలిచారు. అప్పటికే సిలిండర్లు డెలివరీ చేసే ఏజెన్సీ వారికి సమాచారం ఇచ్చారు. వారు బాయ్‌ని పంపించారు. అతను, విజయలక్ష్మి సిలిండర్ వద్దకు వెళ్లేందుకు లైట్ వేసి గది తలుపులు తెరవగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో డెలివరీ బాయ్ బాషా, విజయలక్ష్మి గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం తొలుత ఆత్మకూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం బాషాను నెల్లూరుకు తీసుకెళ్లారు. ఈ ఘటనపై కేసు నమోదు కాలేదు.

పట్టుకున్నారు.. వదిలేశారు

- పిల్లాపేరు నుంచి అక్రమంగా ఇసుక తరలింపు
- స్థానికుల ఫిర్యాదుతో సెబ్ సిబ్బంది దాడులు
- నామమాత్రపు జరిమానాతో వాహనాల విడుదల

ఉదయగిరి: ఉదయగిరిలో కొందరు సెబ్ అధికారులు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు దారితీస్తోంది. ప్రభుత్వ లక్ష్యాలకు తూట్లు పొడుస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఇసుక, మద్యం అక్రమ రవాణా, విక్రయాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాల్సిన వారు అక్రమార్కులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని ఆరోపణలున్నాయి. తాజాగా జరిగిన ఓ ఘటన చర్చనీయాంశమైంది. గండిపాళెం సమీపంలోని పిల్లాపేరు నుంచి ఓ వ్యక్తి అక్రమంగా జేసీబీ, నాలుగు ట్రాక్టర్ల సాయంతో బుధవారం భారీగా ఇసుక తరలిస్తుండగా స్థానికులు గుర్తించారు. సెబ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు దాడులు చేశారు. జేసీబీతోపాటు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. అంతలోనే ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ రెండు ట్రాక్టర్లకు మాత్రమే జరిమానా విధించి మిగిలిన వాటిని వదిలేశారని తెలిసింది. అప్పటికే సుమారు 300 ట్రక్కులకు పైగా ఇసుకను పిల్లాపేరు నుంచి తరలించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. దాడుల్లో పట్టుకున్న జేసీబీతోపాటు మిగిలిన ట్రాక్టర్లను సీజ్ చేయాల్సిన అధికారులు అలా చేయకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. డబ్బు తీసుకుని వాహనాలు వదిలేశారని, మరికొన్నింటిపై నామమాత్రపు జరిమానా విధించారనే ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. దీనిపై సెబ్ ఏఈఎస్ రవికుమార్‌ను గురువారం వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.